

వరి సాగుకు వెనకడుగు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల రైతులు వరి సాగుకు వెనకడుగు వేస్తున్నారు. 8లో▸



పారిశుద్ధ్య పనుల్లో..

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయరాదని పీఆర్ డిప్యూటీ కమిషన్ జాన్ వెస్లీ గ్రామ పంచాయతీ కార్మికులకు సూచించారు. 8లో▸



చెరువును పరిరక్షించండి

తాండూరు పరిధిలోని గొల్ల చెరువును కబ్జాచెర నుంచి కాపాడాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం కోరారు. 9లో▸

న్యూస్‌రీల్

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈ నెల 13న హైదరాబాద్‌లో తలపెట్టిన విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ కోరారు. గురువారం తాండూరులో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న చొరవ మరువలేనిదన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు ప్రకాష్, శివాజీ, వెంకట్, మహేష్, సునీల్, బన్ని, అరుణ్, మల్లేష్, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

'రాడార్' ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ గీత, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లేష్



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ వై గీత, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతానికి చెందిన 2,900 ఎకరాలను రాడార్ స్టేషన్ కోసం కేటాయించారని తెలిపారు. దీంతో 12 లక్షల చెట్లను తొలగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు పేరుతో చెట్ల తొలగింపు బాధాకరమన్నారు. అంతేకాకుండా 60 నుంచి 70 కిలోమీటర్ల మేర రేడియేషన్ ప్రభావం ఉంటుందని అన్నారు. రాడార్ స్టేషన్ కోసం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దామగుండం వాసి సత్యానంద స్వామి, నాయకులు రాములు, శ్రీకాంత్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


జీపీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించే కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. గురువారం జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడం తోపాటు అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా రూ.20 లక్షలు, గుర్తింపు కార్డులు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. వయసు పైబడిన వారిని తొలగించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల డిమాండ్లను వెంటనే తీర్చాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ వాసుచంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీశైలం, అశోక్, పెద్దారెడ్డి, ప్రవీణ్, నర్సింలు, అనంతయ్య, రవికుమార్, నారాయణ, బాలయ్య, లక్ష్మణ్, బాలకృష్ణ, శ్రీనివాస్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.



పాతాళంలోనే..

సగం కూడా నిండని కోట్‌పల్లి ప్రాజెక్టు

పైకి రాని గంగమ్మ

- గతేడాదితో పోలిస్తే రెండు మీటర్ల లోతున..
- కొన్ని మండలాల్లో 30మీటర్ల లోతులో..
- జిల్లాలో ఒక్క చెరువూ నిండని వైనం
- వర్షాలు పడినా పెరగని భూగర్భజలాలు



వికారాబాద్: వర్షాకాలం సగం పూర్తయినా జిల్లాలో భూగర్భజలాలు ఇంకా అట్టడుగునే ఉన్నాయి. బోర్లు, బావుల్లో నీళ్లు రావడం లేదు. పలు మున్సిపాలిటీల్లో నేటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. చాలా మండలాల్లో అనుకున్న మేర వర్షపాతం నమోదైనా చెరువులు, కుంటలు నిండలేదు. గతేడాది వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈ సారి రెండు మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఏటా ఈ సీజన్‌లో రైతులు 1.30లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. ప్రస్తుతం చెరువులు, బోరు బావుల్లోకి నీరు చేరకపోవడంతో వరి నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు పెంపునకు అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇంకుడు గుంతలపై దృష్టి సారించడం లేదు. జిల్లాలో వేలకు వేలు ఇంకుడు గుంతలు తవ్వామని చెబుతున్నా వాటి నిర్వహణను గాలికొదిలేశారు. చెక్ డ్యామ్‌లు, ఫారంపండ్స్, చెరువులు, కుంటల్లో పూడిక తీయకపోవడంతో వర్షాపు నీరు భూమిలోకి ఇంకకుండా వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతోంది.

గతేడాదితో పోలిస్తే..

గతేడాదితో పోలిస్తే భూగర్భ జలాలు ఈ ఏడాది ఎక్కువగా అడుగంటాయి. 2023 జూలై చివరలో జిల్లాలో సగటున 10.25 మీటర్ల లోతుకు భూ గర్భ జలాలు పడిపోగా ఈ ఏడాది అదే జూలై నెలాఖరు వరకు 12.12 మీటర్ల లోతుకు జలాలు పడిపోయాయి. పెద్దేముల్ మండలం నాగులపల్లిలో 30 మీటర్ల లోతుకు, బొంరాస్‌పేట్ మండలం అంసాన్‌పల్లిలో 29 మీటర్లు, యాలాల మండలం దేవనూర్‌లో 26.78 మీటర్లు, నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లిలో 24 మీటర్లు, వికారాబాద్‌లో 23 మీటర్ల లోతుకు పడిపోయాయి. కొడంగల్ మండలం రుద్రారం(డీ)లో 22మీటర్లు, రుద్రారం(ఎస్)లో 21 మీటర్లు, మర్పల్లి మండలం దర్గుపల్లిలో 20మీటర్ల లోతుకు పడిపోయాయి. జిల్లాలోని సగం మండలాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నట్లు భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు చెబుతున్నాయి. సాధారణంగా జూలై చివరినాటికి వరి నాట్లు వేసుకునేందుకు అనుకూలంగా ఉండాలి. ఈ సారి ఆ పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వరి సాగు చేయకపోతే దిగుబడి రాదని అన్నదాతలు తెలిపారు.

వరినాట్లపై ప్రభావం

ఈ ఏడాది సగటు వర్షపాతం కంటే ఎక్కువ వానలు పడ్డా చెరువులు మాత్రం నిండలేదు. జిల్లాలో 1,179 చెరువులు ఉన్నాయి. గతేడాది జూలై నాటికి 1,023 చెరువులు నిండాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క చెరువు కూడా నిండలేదు. దీంతో వరి సాగుపై తీవ్ర ప్రభావం పడనుంది. పరిస్థితి ఇలాగే ఉంటే వరినాట్లు వేసుకోవటం గగనమే. భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో పదెకరాలు సాగు చేయాల్సిన చోట ఐదెకరాలు సాగు చేయాలనే ఆలోచనలో రైతులు ఉన్నారు.

వనరులను కాపాడుకోవాలి

గ్రౌండ్ వాటర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ప్రధానంగా ఇంకుడు గుంతలు తవ్వడం తోపాటు వాటి నిర్వహణ సక్రమంగా ఉండాలి. చెరువులు, కుంటలు, ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లలో పూడిక తీసి నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలి. నీటిని పొదుపుగా వాడటం కూడా ఓ సామాజిక బాధ్యతగా భావించాలి.

– రవిశంకర్, జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్

పర్యవేక్షణ కరువై..

పరిశ్రమలకు వరమై..

- అనుమతులు లేకుండా ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

కొత్తూరు: అధికారుల పర్యవేక్షణ కొరవడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. సరైన అనుమతులు పొందకుండానే కొందరు వ్యాపారులు ఇష్టారీతిన పరిశ్రమలను ప్రారంభిస్తున్నారు. ఏవైనా ప్రమాదాలు.. ఇతర సంఘటనలు చోటు చేసుకునే వరకు ఇలాంటి పరిశ్రమలు స్థానికంగా కొనసాగుతున్నాయనే విషయం స్థానిక, ఉన్నతాధికారులకు తెలియడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొత్త పరిశ్రమల ఏర్పాటుతో ప్రభుత్వ ఖజానాకు ఆయా పన్నుల రూపంలో చేరాల్సిన ఆదాయం రావడం లేదు. కొత్తగా పరిశ్రమలు, గోదాములు ఏర్పాటు చేసే వ్యాపారులు అధికారులను 'మేనేజ్' చేస్తుండడంతో వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలో 313 పరిశ్రమలు కొనసాగుతుండగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నట్లు పరిశ్రమల శాఖ లెక్కలు చెబుతున్నాయి.

అక్కడ వద్దంటే.. ఇక్కడికి..

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో భాగంగా పట్టణం సమీపంలో కొనసాగుతున్న కాలుష్య కారక పరిశ్రమలను అక్కడి నుంచి తరలించాలని అధికారులు ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. దీంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు నగర శివారులోని కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ ప్రాంతాల వైపు దృష్టి సారిస్తున్నారు. రెండు నుంచి పదెకరాల వరకు వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తూ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు.



పరిశ్రమ కోసం పూర్తిస్థాయి అనుమతులు పొందకుండా కొత్తూరులో నిర్మించిన షెడ్డు

అనుమతులు అంతంతే..

- కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారు తాము కొనుగోలు చేసిన వ్యవసాయ భూములను ప్రభుత్వానికి నిర్ణీత పన్నులు చెల్లించి వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. అయితే పదెకరాలు కొనుగోలు చేస్తే రెండు, మూడెకరాలు మాత్రమే వ్యవసాయేతర భూమిగా మార్చుకుంటున్నారు.
- పరిశ్రమల ఏర్పాటుకు హెచ్ఎండీఏ, గ్రామ పంచాయతీతో పాటు అన్ని శాఖల నుంచి అనుమతి పొందాలి. ఇక్కడ మాత్రం పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందేందుకు వీలుగా మాత్రమే అనుమతులు పొందుతున్నారు.
- పరిశ్రమల నిర్మాణాలకు సంబంధించిన పత్రాలను పంచాయతీకి అందిస్తే వారు ఆ నిర్మాణాల ఆధారంగా ఏటా పన్నులు వసూలు చేస్తారు. నిర్వాహకులు పూర్తిస్థాయి నిర్మాణ పత్రాలు ఇవ్వడం లేదు. దీంతో పన్నులు తక్కువగా వసూలయ్యే అవకాశం ఉంది.
- అప్పటికే కొనసాగుతున్న పరిశ్రమల్లో తదుపరి అవసరాల కోసం కొత్తగా చేపట్టే నిర్మాణాలకు అనుమతులు తీసుకోవడంలోనూ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటవుతున్న పరిశ్రమలు తాము టీఎస్ ఐపాస్‌లో దరఖాస్తు చేసుకున్నాం.. అన్ని అనుమతులు ఉన్నాయని ప్రకటిస్తున్నప్పటికీ గేటు బయట పరిశ్రమల పేర్లను మాత్రం నమోదు చేయడం లేదు.

నిర్లక్ష్యవైఖరి

ప్రభుత్వ అనుమతులు లేకుండా చిన్న షెడ్డును నిర్మించిన వారిపై చర్యలు తీసుకునే సంబంధిత శాఖ అధికారులు ఏకంగా పరిశ్రమలను స్థాపించి అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలో కొత్తగా నిర్మిస్తున్న గోదాములు, పరిశ్రమలు, అప్పటికే కొనసాగుతున్న వాటి వివరాలు తెలిసినప్పటికీ చర్య లు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చట్ట ప్రకారం చర్యలు



మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు అని తేలితే చర్యలు తప్పవు. ఇప్పటికే కొన్నిచోట్ల అక్రమ నిర్మాణాలు చేపట్టిన సదరు యజమానులకు నోటీసులు జారీ చేశాం. గడువులోగా స్పందించకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ, మున్సిపల్ కమిషనర్, కొత్తూరు

కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

మొయినాబాద్: కేన్సర్ లక్షణాలున్నవారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ సూచించారు. ఇండియన్ కేన్సర్ సొసైటీ సౌజన్యంతో మొయినాబాద్ పీహెచ్‌సీలో గురువారం కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 105 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. కేన్సర్ లక్షణాలున్న పది మందిని ఎంఎంజే కేన్సర్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. కేన్సర్ ప్రారంభదశలో ఉంటే మందుల ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. అశ్రద్ధ చేస్తే ప్రమాదమని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్, డాక్టర్లు శ్రీనివాస్, స్వర్ణలత, అన్నపూర్ణ, సీహెచ్‌ఓలు సంతోష, వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధులకు చెక్

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి పూర్ణచందర్‌రావు

ధారూరు: ముందస్తు టీకాలతో పశువుల్లో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి పూర్ణచందర్‌రావు అన్నారు. గురువారం ధారూరు, కేరెల్లి గ్రామాల్లోని పశువైద్యశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల్లో రికార్డులు, మందులను పరిశీలించారు. పశువులకు సోకే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జీవాలకు సకాలంలో వైద్యం చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ధారూరు వెటర్నరీ డాక్టర్ స్వేత, సిబ్బంది పాల్గొన్నారు.



ధారూరు పశువైద్యశాలను పరిశీలిస్తున్న పూర్ణచందర్‌రావు

'అమ్మ ఆదర్శ' పనులు వేగిరం

- ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ప్రతి వారం సమీక్ష
- బిల్లుల జాప్యంపై సీరియస్



కుల్కచర్ల మండలం అంతారం పాఠశాలలో విద్యుత్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్: జిల్లాలో ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రహరీల నిర్మాణం, ఇతర మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన పనులను మూడు దశల్లో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. పనుల పర్యవేక్షణ బాధ్యతలు విద్యాశాఖకు అప్పగించగా టెక్నికల్ సపోర్టు, బిల్లులు చేసే బాధ్యతలు ఇంజనీరింగ్ శాఖ చూస్తోంది. ఈ శాఖల మధ్య సమన్వయ లోపంతో పనుల పురోగతి మందగించింది. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులకు సంబంధించిన బిల్లులు రాయడంలో జాప్యాన్ని గుర్తించి ఇంజనీరింగ్ అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. ఎంబిల్ రాయడం నేటి(శనివారం)తో పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు చీకటి పడేదాకా విధులు నిర్వహించి బిల్లులు రాసే ప్రక్రియను పూర్తి చేశారు. ఆ వెంటనే కలెక్టర్ బిల్లులను క్లియర్ చేశారు.

929 పాఠశాలల్లో పనులు

జిల్లాలో 1,032 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గత ప్రభుత్వం మన ఊరు – మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 371 పాఠశాలలు ఎంపిక చేసింది. వీటిలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. 2023 చివరి నాటికి 51 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మరో 292 పాఠశాలల్లో పనులు జరుగుతుండగా 28 స్కూళ్లలో పనులు ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద 929 స్కూళ్లను ఎంపిక చేశారు. వీటిలో వివిధ అభివృద్ధి పనులు, మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు రూ.35.5కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయి. 202 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా గత వారం బిల్లులకు సంబంధించి రూ.1.83 కోట్లను కలెక్టర్ విడుదల చేశారు.

పరిశీలన తరువాతే మిగతా బిల్లులు

అమ్మ ఆదర్శ పాఠశాలల పురోగతిపై కలెక్టర్ ప్రతి వారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పనులు పూర్తయిన 202 పాఠశాలలకు బిల్లులు మంజూరు చేశారు. పనుల నాణ్యత విషయంలో అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పనుల పరిశీలనకు ప్రత్యేకాధికారులను నియమించారు. వారి నివేదిక ఆధారంగా మిగిలిన పాఠశాలలకు బిల్లులు విడుదల చేసే అవకాశం ఉంది.

ఎల్‌ఆర్‌ఎస్ ఎప్పుడో!

క్రమబద్ధీకరణకు అడుగడుగునా ఆటంకాలు

- క్షేత్రస్థాయిలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- సాఫ్ట్‌వేర్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు
- అధికారులకు సవాల్‌గా మారిన దరఖాస్తుల పరిశీలన
- అన్ని మున్సిపాలిటీల్లోనూ ప్రధానంగా ఇవే ఇబ్బందులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికారిక లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియకు సిబ్బంది కొరతకు తోడు సాంకేతిక సమస్యలు అవరోధంగా మారుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన పోర్టల్ తరచూ మొరాయిస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది పోర్టల్ లాగినై.. అన్ని వివరాలను నమోదు చేసి, తీరా సబిమిట్ మీట నొక్కితే.. ఫీజు చెల్లింపులు, రసీదులు, ప్రొసీడింగ్స్ జారీ వంటి ప్రక్రియ పూర్తికాక పోగా, మళ్లీ మొదటికొస్తుండటంతో ఏం చేయాలో అర్థంకాక ఆయా పురపాలికల్లోని అధికారులు తల పట్టుకుంటున్నారు. ఇప్పటికే అక్రమ నిర్మాణాల గుర్తింపు, నియంత్రణ చర్యల్లో భాగంగా వాటి కూల్చివేతలు, కొత్త భవనాలకు అనుమతుల జారీ, ఇంటి పన్ను నిర్ధారణ, వసూళ్ల వంటి ప్రక్రియతో బిజీగా ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు వేలల్లో పేరుకుపోయిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సవాల్‌గా మారింది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రధానంగా ఇదే సమస్య వేధిస్తోంది.

తరచూ మొరాయిస్తున్న సర్వర్

ఖాళీ ప్లాట్లు/ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుకు రూ.పది వేలు, ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వేయి ఫీజుగా నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్లలో 3,58,464 దరఖాస్తులు రాగా, జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్ల పరిధి నుంచి అత్యధికంగా 2,28,143 దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకు 787 దరఖాస్తు లను మాత్రమే పరిష్కరించారు. మిగిలినవన్నీ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసింది. మూడు నెలల్లో వీటిని పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించింది. జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీలోనూ ఆశించిన స్థాయిలో సిబ్బంది లేరు. ఇదిలా ఉంటే జిల్లా నుంచి అందిన దరఖాస్తుల్లో మెజార్టీ ప్లాట్లు, లే అవుట్లు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, చెరువులు, కుంటలు, బఫర్‌జోన్లకు సమీపంలోనే ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలనలో అధికారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా భవిష్యత్తులో చిక్కులు తప్పవు. టౌన్‌ప్లానింగ్, నీటి పారుదల, రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తే కానీ.. ఆయా దరఖాస్తులకు పరిష్కార మార్గం లభించని పరిస్థితి. అంతేకాదు 111జీఓ పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల నుంచి అందిన దరఖాస్తుల విషయంలోనూ తలనొప్పులు ఎదురయ్యే అవకాశం ఉంది.

దరఖాస్తులు ఇలా..

మున్సిపాలిటీ/కార్పొరేషన్	దరఖాస్తులు
తుర్కయంజాల్	49,759
బడంగ్‌పేట్	47,793
పెద్ద అంబర్‌పేట్	43,740
షాద్‌నగర్	16,450
ఆదిబట్ల	14,889
ఇబ్రహీంపట్నం	13,142
జల్‌పల్లి	10,892
బండ్లగూడ	7,240
శంషాబాద్	6,672
ఆమనగల్లు	3,447
నార్సింగి	3,354
శంకర్‌పల్లి	3,300
మీర్‌పేట్	3,087
కొత్తూరు	2,767
తుక్కుగూడ	2,544
మణికొండ	2,421

క్లుప్తంగా

తాగిన మైకంలో 100కు డయల్

కేసు నమోదు



పోలీసుల అదుపులో నిందితుడు. వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ అరవింద్

మోమిన్‌పేట: తాగిన మైకంలో 100 నంబర్‌కు డయల్ చేసి సమయాన్ని వృథా చేసిన మందుబాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కేసారం గ్రామానికి చెందిన గుజ్జరి ప్రభాకర్ బుధవారం సాయంత్రం మద్యం సేవించి 100కు డయల్ చేశాడు. పోలీసులు అక్కడికి వెళ్లగా.. మద్యం మత్తులో చేశాడని గ్రహించారు. గురువారం వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించారు. గతంలో కూడ ఇతనిపై పలు కేసులు నమోదయ్యాయని ఎస్‌ఐ తెలిపారు. అనవసరంగా ఫోన్ చేసి పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేయవద్దని, అత్యవసరమైతే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవ్వండి



సిద్దులూర్ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న సుధీర్

అనంతగిరి: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం వికారాబాద్ మండలం సిద్దులూర్‌లో ఆయన పర్యటించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులను, అంగన్‌వాడీ కేంద్రానికి వేస్తున్న పెయింటింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంతో షాద్‌నగర్‌వాసి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శ్రీనిజ్‌రెడ్డి

షాద్‌నగర్: పెట్టుబడుల నిమిత్తం అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం షాద్‌నగర్ వాసి చెంది శ్రీనిజ్ రెడ్డి కలిశారు. డల్లాస్‌లో ప్రవాస భారతీయులతో సీఎం సమావేశం కాగా, ఇందులో కాంగ్రెస్ నేత తిరుపతిరెడ్డి కొడుకు శ్రీనిజ్.. సీఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు.

వరద బాధితులకు అండగా..

షాద్‌నగర్: కేరళలోని వయనాడ్‌లో వరద బాధితులకు అందరూ అండగా నిలబడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని వరద బాధితుల కోసం విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళలో వరద బీభత్సంతో వయనాడ్ ప్రాంతం పూర్తిగా నీటిలో మునిగిపోయిందన్నారు. ప్రకృతి విపత్తు కారణంగా ప్రజలందరూ నిరాశ్రయులుగా మారారన్నారు.ప్రజలు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారని, వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సహకారం అందించాలని సూచించారు.

వరి సాగుకు వెనకడుగు

- పెరగని భూగర్భ జలాలు
- నీరందక ఆసక్తి చూపని అన్నదాతలు
- 10 వేల ఎకరాలకు తగ్గిన పంట విస్తీర్ణం



ఆలేడ్ నారు మడిలో నిల్వ ఉన్న నారు

దుద్యాల్: వర్షాభావం నేపథ్యంలో వరి సాగుకు రైతన్నలు వెనకడుగు వేస్తున్నారు. మండల పరిధిలో వానాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవ లేదు. ఫలితంగా భూగర్భ జలాలు పెరగక.. ఆశించిన మేర బోర్లు నీరు పోయడం లేదు. దీంతో సాగును ముమ్మరం చేసిన తరువాత నీరు అందక ఎండి పోయే ప్రమాదం ఉందన్న కారణంతో అన్నదాతలు ఆసక్తి చూపడంలేదు. కనీసం పెట్టుబడి దక్కకపోతే అప్పుల పాలవుతామని ఆందోళన చెందుతున్నారు.

మడుల్లోనే నారు

జోరుగా వర్షాలు కురిస్తే.. సాగు విస్తీర్ణం పెంచాలన్న ఆలోచనలతో మండల పరిధి గ్రామాల అన్నదాతలు నారు మడులు అధికంగా పోసుకుని సిద్ధంగా ఉన్నారు. కానీ ఆశించిన మేర వానలు కురవకపోవడంతో సగం వరకే నాట్లు వేసుకున్నారు. మిగతా నారు మడుల్లోనే ఉండిపోయింది. గతేడాది ఉమ్మడి మండలం(బొంరాస్‌పేట్-దుద్యాల్)లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా.. ఈసారి ఇప్పటి వరకు 10 వేల ఎకరాల లోపే సాగైందని మండల వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.



కుదురుమల్లలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

సగానికి సగం..

గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం వరి పంట సాగు సగానికి పడిపోయింది. వర్షాలు కురవక పోవడంతో సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జులై మాసం వరకు సుమారు 20 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అయ్యేది. ప్రస్తుతం 10 వేల ఎకరాల వరకే నాట్లు వేశారు. ఏదేమైనా సాగు విస్తీర్ణం చాలా తగ్గింది.

– అనురాధ, వ్యవసాయ అధికారి, బొంరాస్‌పేట్

రెగ్యులరైజ్ హామీని నిలబెట్టుకోవాలి

ఎమ్మెల్యేను కోరిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

యాలాల: అధికారంలోకి రాగానే సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఉద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 20 ఏళ్లుగా ఎస్‌ఎస్‌ఏలో చాలీచాలని వేతనాలతో బతుకుబండిని నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. క్రమబద్ధీకరించాలని గతంలో 21 రోజుల పాటు సమ్మె చేశామని, ఆ సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమ సమ్మెకు మద్దతు తెలిపారని గుర్తుచేశారు. అనంతరం వరంగల్ సభలో అధికారంలోకి వచ్చాక తమను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. వేతనాల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోహన్‌సింగ్, కేజీబీవీ సీఆర్‌టీలు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు



తొర్మామిడిలో డీపీఓతో మాట్లాడుతున్న కమిషన్ జాన్ వెస్లీ

- వీధులను పరిశుభ్రంగా ఉంచాలి
- తడిపొడి చెత్తతో ఎరువు తయారు చేయాలి
- పీఆర్ డిప్యూటీ కమిషన్ జాన్ వెస్లీ

బంట్వారం: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి రోజు ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ చేపట్టాలని జీపీ కార్మికులను పీఆర్ డిప్యూటీ కమిషన్ జాన్ వెస్లీ ఆదేశించారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండల పరిధి తొర్మామిడి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కంపోస్టు షెడ్డు, వైకుంఠ ధామం, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల వద్దనే తడి పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్మికులకు చెత్త బుట్టలను ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. వేరు చేసిన చెత్తతో కంపోస్టు షెడ్డులో వానపాములు వేసి క్రమం తప్పకుండా ఎరువును తయారు చేయాలన్నారు. గ్రామాల్లో వీధులన్నీ శుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువలను, తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అనంతరం నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఓ జయసుధ, డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, జ్యోతి, ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, టీఏలు అశోక్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

‘మా భూమిని ఇప్పించండి’



తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధిత రైతు కుటుంబం

మోమిన్‌పేట: ‘మా భూమిని ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. మా స్థలాన్ని మాకు ఇప్పించి న్యాయం చేయండి’ అని భూబాధితులు గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈ మేరకు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి దుర్గంచర్వు గ్రామానికి చెందిన కనకంటి నర్సింలు తన కుమారుడు రమేష్ పేరున అదే గ్రామ వాసి విశాలక్ష్మికి చెందిన 175 సర్వే నంబరులోని 1ఎకర 14గుంటల భూమిని 2015లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. నాటి నుంచి సాగు చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోలేదు. ధరణిలో విక్రయించిన విశాలక్ష్మి పేరున పట్టా ఉండటంతో ఆ భూమిని అదే గ్రామానికి చెందిన అనంతమ్మకు తిరిగి విక్రయించారు. దీంతో ఆందోళన చెందిన బాధిత రైతు తహసీల్దార్‌ను ఆశ్రయించాడు.

విచారణ చేపడతాం

రిజిస్ట్రేషన్ చేయించుకొని తొమ్మిదేళ్లుగా ముటేషన్‌కు దరఖాస్తు చేసుకోకపోవడంతో పట్టాదారు పేరుమీదే భూమి ఉందని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. దీంతో తొలుత రమేష్‌కు విక్రయించినవారే మరలా మరొకరికి ఆ భూమిని విక్రయించారని చెప్పారు. కాని కాస్తులో రమేష్ పేరు ఉందని, విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

భూత వైద్యులను నమ్మొద్దు

శంకర్‌పల్లి: భూత వైద్యం చేస్తామంటూ వచ్చేవారిని నమ్మొద్దని గద్వాల జిల్లా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతమ్మ అన్నారు. గురువారం ఆ కళాశాల బీఎస్సీ విద్యార్థినులతో కలిసి ఆమె శంకర్‌పల్లి పీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం విద్యార్థులు భూత వైద్యంపై నాటకాన్ని ప్రదర్శించి, రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు మూఢ నమ్మకాలను ఇప్పటికైనా వీడనాడాలని, వారు చెప్పే మాయమాటలను నమ్మరాదని సూచించారు. పీహెచ్‌సీ వైద్యురాలు రేవతి రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపిక ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి

చేవెళ్ల: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన కండ్లపల్లి చంద్రయ్య(65) వ్యవసాయకూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో.. చంద్రయ్య ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు బాధితున్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ జిల్లాలోని మిషన్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ చంద్రయ్య గురువారం చనిపోయాడు. మృతుడి కొడుకు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ

శంకర్‌పల్లి: హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం అర్ధరాత్రి శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శివమ్ ప్లెవుడ్, హార్డ్‌వేర్ దుకాణాన్ని సురేష్ అనే వ్యక్తి నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా.. షట్టర్ తెరిచి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా.. కౌంటర్‌లో ఉన్న రూ.30 వేల నగదు చోరీకి గురయినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

లడ్డూ నగదు అందజేత

కడ్తాల్: మండల పరిధి మైసిగండి గ్రామంలో గత ఏడాది గణేశుడి చేతిలోని లడ్డూకు వేలంపాట నిర్వహించగా.. రూ.5.01 లక్షలకు మైసిగండి మాజీ సర్పంచ్ తులసీరాం నాయక్ దక్కించుకున్నాడు. సదరు నగదును గురువారం మైసిగండిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హీరాసింగ్‌కు, తులసీరాం నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు.. నాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జవహర్‌లాల్, రమేశ్, రాందాస్‌నాయక్, రవి, రాము, తులసీరాం, యాదగిరి ఉన్నారు.

ఇంగ్లిషే కాదు.. తెలుగులోనూ తడబాటే

- పట్టుకోల్పోతున్న విద్యార్థులు
- అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయుల కృషి
- తరగతుల వారీగా ‘ప్రత్యేక’ శ్రద్ధ



హస్నాబాద్ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

దుద్యాల్: సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల కనీస అభ్యసన సామర్థ్యాలు తగ్గిపోతున్నాయని వివిధ సర్వేల్లో వెల్లడవుతోంది. ఒక ఆంగ్లంలోనే కాదు మాతృభాష తెలుగులోనూ తడబడుతున్నట్లు స్పష్టం అవుతోంది. గణితంలోనూ వెనుకబడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేందుకు విద్యాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పఠన శక్తి, రాయటం వంటివి ప్రత్యేక విధానంతో విస్తృతం చేశారు.

స్పందన ప్రతి స్పందన

3,6,9 తరగతుల పిల్లలకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంపెక్స్ సమావేశం నిర్వహించారు. ఇందులో విధి విధానాలను మండల విద్యాధికారి రాంరెడ్డి ఉపాధ్యాయులకు వివరించారు. పఠన, రాయడం, స్పందన ప్రతి స్పందన వంటి అంశాలపై త్వరలో ప్రతి పాఠశాలలో సర్వే చేసి, విద్యార్థులను పరీక్షించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భాషా ప్రావీణ్యం పొందేలా..

విద్యార్థుల వెనుకబాటుకు కారణాలు తెలుసుకుని వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తరగతుల వారీగా చిన్నారుల్లో విద్యా సామర్థ్యాలు పెంచడం, బాగా చదవడం, రాయడం వంటి అంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలతో పాటు భాషా ప్రావీణ్యం పొందేలా తరగతులు బోధిస్తున్నారు. విషయం వారిగా చర్చించి బోధనోపకరణాలతో అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు విద్యాధికారులు సిద్ధం అవుతున్నారు.

రైతులకు ఇచ్చిన మాట నిలుపుకోండి

కిసాన్‌మోర్చా రంగారెడ్డి అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

కేశంపేట: రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధి కొత్తపేట గ్రామంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రైతు రచ్చబండను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను నిలుపుకోకుండా.. షరతులు విధిస్తూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. బేషరతుగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కోరారు. పుష్కర కాలంగా కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, అయినా దానినే ప్రామాణికంగా తీసుకుని రుణమాఫీకి లింక్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులతో పాటు కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు రైతులకు పూర్తి స్థాయిలో రైతుబంధు వేయలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. రచ్చబండ కార్యక్రమం అత్యధికంగా పార్టీ శ్రేణులతో కొనసాగడం గమనార్హం. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్యలు, మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, భైపాలచారి, మధుసూదన్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, నరసింహ్మారెడ్డి, మోటే శ్రీను, నరసింహ, ఐలయ్య, విఠల్‌గౌడ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్ధాకలితో అలమటిస్తున్న కార్మికులు

- పెండింగ్ వేతనాలు చెల్లించి ఆదుకోండి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులతో పనిచేయించుకుంటూ.. 8 నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని, తద్వారా కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతూ.. అర్ధాకలితో అలమటిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. వెంటనే వారికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ఫరూఖ్‌నగర్ ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీసం వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. కార్మికులు మరణిస్తే తక్షణ సహాయం కింద రూ.30వేలు ఇవ్వాలన్నారు. కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



షాద్‌నగర్: పాఠశాల ఆవరణలో మొక్కనాటి నీరుపోస్తున్న అధికారులు

- ‘స్వచ్ఛదనం’లో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వండి
- రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

కందుకూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం మండల పరిధి నేదునూరులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌లో వంట గది, విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించారు. తాగునీటి సరఫరా తీరును పర్యవేక్షించారు. కిచెన్ గార్డెన్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రిన్సిపాల్ శ్రీధర్‌కు సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, సీడీపీఓ శాంతిశ్రీ, ఎంపీఓ గీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, ఏఓ లావణ్య, ఏపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీఏ రవి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



నేదునూరు జడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ తదితరులు

మలమూత్ర విసర్జన తర్వాత..

షాద్‌నగర్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను విధిగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ సూచించారు. స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగంగా ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు విధిగా వారంలో మూడు సార్లు తలస్నానం చేయాలని సూచించారు. చేతి వేలి గోర్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని, నిత్యం ఉదయం, సాయంత్రం బ్రెష్ చేసుకోవాలని చెప్పారు. మలమూత్ర విసర్జన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని, ఉతికిన దుస్తులు మాత్రమే వేసుకోవాలని, వేడి ఆహారాన్ని తినాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ చంద్రకళ, డాక్టర్ నాగేంద్రబాబు, హెచ్‌ఎం శైలజ, శంకర్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రా‘ఫికర్’



మొయినాబాద్ ప్రధాన కూడలిలో సిగ్నల్ వ్యవస్థ

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- అలంకారప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ
- సమస్య పట్టని ట్రాఫిక్ పోలీసులు

మొయినాబాద్: పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు.. ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. దానికి తోడు ఇష్టారీతిన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాల నిలుపుదలతో ఇక్కట్లు అధికమవుతున్నాయి. ఇక ప్రధాన చౌరస్తాలో వెహికిల్స్ ఎటు నుంచి ఎటు వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి. సిగ్నల్ వ్యవస్థ ఉన్నప్పటికీ.. ఆ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఉన్నా.. వారు చొరవ చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డుపై కూలీల నిరీక్షణ

మహానగరానికి చేరువలో.. బీజాపూర్ హైవేలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మొయినాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమయ్యాయి. రహదారికి ఇరువైపున ఉన్న దుకాణ సముదాయాలు, బ్యాంకుల ఎదుట ఇష్టంగా వాహనాలు పార్కు చేస్తున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన కూడలిలో ఉదయం వేళలో వందల మంది అడ్డా కూలీలు రోడ్డుపైనే నిరీక్షిస్తుండంతో ఇదీ ఒకింత కారణం అవుతోంది. తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి.



బస్టాపులో ఆటోలు పార్కుచేయడంతో రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

బస్టాపుల్లో పార్కింగ్

బస్టాపుల్లో ఆటోలు నిలుపుతుండడంతో బస్సులు రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీంతో ప్రయాణికులతో పాటు వెనుక వచ్చే వాహన దారులు.. బస్సుల వెనకాలే ఉండటంతో అది కదిలే వరకు ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీనికి తోడు రోడ్డు పక్కనే చిరువ్యాపారుల తోపుడు బండ్లతో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది.

జరిమానాకే పరిమితం

ట్రాఫిక్ కష్టాలు తీర్చడం కోసం ప్రధాన కూడలిలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ సిగ్నళ్లను ఎవరూ పట్టించుకోకుండా ఇష్టానుసారం దూసుకెళ్తున్నారు. కానిస్టేబుళ్లు ఉన్నా.. రూల్స్ పాటించని వాహనాలను నిలువరించడం మానేసి.. ఫొటోలు తీసి జరిమానా విధిస్తున్నారు. కానీ.. సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పరిష్కరిస్తాం

మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పెరిగింది. సిగ్నల్ వ్యవస్థను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తాం. ఇష్టానుసారం వాహనాలు పార్కింగ్ చేసినవారిపై చర్యలు తీసుకుంటాం. తోపుడు బండ్లతో ట్రాఫిక్ ఇక్కట్లు ఏర్పడితే వాటిని తొలగిస్తాం.

– కిరణ్, ట్రాఫిక్ సీఐ, రాజేంద్రనగర్